క్లుప్తంగా

జోరుగా రెండో రోజు పింఛన్ల పంపిణీ



లబ్ధిదారుకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సుభాషిణి

అక్కిరెడ్డిపాలెం: వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ రెండో రోజు జోరుగా సాగింది. సోమవారం వేకువ జాము నుంచి 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్లు అందజేశారు. వలంటీర్ సుభాషిణి, పార్టీ నగర ప్రధాన కార్యదర్శి సంద్రాన నూకరాజుతో కలిసి వృద్ధులకు పింఛన్లు అందజేశారు.

ఉత్సాహంగా మెగా శాకాహార ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ధ్యానులు

గాజువాక: ఉత్తరాంధ్ర పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో గాజువాకలో సోమవారం మెగా శాకాహార సద్భావన ర్యాలీ నిర్వహించారు. భారీ సంఖ్యలో ధ్యానులు శాకాహార విశిష్టతను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంవద్ద ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు, పిరమిడ్ మాస్టర్లు రేవతీదేవి, శివ గణేశ్వరరావు, జయలక్ష్మి, చంద్రశేఖర్, సతీష్, బాలాజీ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ ప్రారంభం



మంచినీటి ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి సమీపంలోని గొన్నవానిపాలెం గ్రామంలో శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్మించిన మంచినీటి ట్యాంక్‌ను పెందుర్తి ఎమ్మెల్యే ఎ.అదీప్‌రాజ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వమే అన్ని కార్యక్రమాలు చేయాలని ఎదురు చూడకుండా గ్రామ యువత, కమిటీ నాయకులు సంయుక్తంగా దాతల సహకారంతో మంచినీటి ట్యాంక్ ఏర్పాటు చేయడంతో పాటు యువత కోసం షటిల్ కోర్టు నిర్మించడం అభినందనీయమన్నారు. కమిటీ ప్రతినిధులు గొన్నా శ్రీనివాసరావు, హేమచంద్ నాయుడు, గుమ్మాల శ్రీనివాసరావు, టి.వెంకటరమణ, గొన్నా బొరయ్యనాయుడు జితేంద్ర సాయి పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణే ధ్యేయం



శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

కూర్మన్నపాలెం: కార్మిక శక్తిని అణచివేసే ప్రయత్నం చేస్తున్న బీజేపీ పాలనకు స్వస్తి చెప్పే సమయం ఆసన్నమైందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణే తమ ధ్యేయమన్నారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో 963వ రోజు సోమవారం పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ముందుగా దీక్ష శిబిరం వద్ద గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల పెట్టుబడి మాత్రమే పెట్టగా.. కార్మికులు 30 ఏళ్ల శ్రమించి స్టీల్‌ప్లాంట్ ఆస్తులను లక్షల కోట్లకు పెంచారన్నారు. అటువంటి పరిశ్రమను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని సూచించారు.

మహాత్ముడి మార్గం అనుసరణీయం

- జయంతి వేళ గాంధీజీకి ఘన నివాళులు
- లాల్‌బహదూర్ శాస్త్రికి స్మృత్యంజలి
- ఆదర్శమూర్తుల అడుగుజాడల్లో నడవాలని నేతల పిలుపు



గాజువాక జోనల్ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



స్టీల్‌ప్లాంట్‌లో గాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న సీఎండీ, డైరెక్టర్లు, అధికారులు



76వ వార్డులో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దేవన్‌రెడ్డి తదితరులు



85వ వార్డులో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్



గాంధీ విగ్రహం వద్ద సద్భావన ప్రతిజ్ఞ చేస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉష, సిబ్బంది



మహాత్మా గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి విగ్రహాలకు నివాళులర్పిస్తున్న 70వ వార్డు కార్పొరేటర్ చందు

గాజువాక: జాతిపిత మహాత్మా గాంధీ, భారతదేశ రెండో ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రిల జయంతి సందర్భంగా వారి విగ్రహాలు, చిత్రపటాల వద్ద పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సోమవారం నివాళులర్పించారు. దేశానికి వారు అందించిన సేవలు అజరామరమని, వారి ఆశయాలకు నేటి నాయకులు, యువత పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.

- గాజువాక జోనల్ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య సాధనలో గాంధీజీ పాత్రను కొనియాడారు. జోనల్ కమిషనర్ పి.సింహాచలం, ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. గాంధీ విగ్రహానికి 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, జి.ఆనంద్, అప్పారి విష్ణుమూర్తి, కె.అచ్యుతరావు, కర్రి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో గాంధీజీకి నివాళులర్పించారు.
- 70వ వార్డు డ్రైవర్స్ కాలనీలో మహాత్మాగాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి విగ్రహాలకు ఆ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు నివాళులర్పించారు. నాయకులు పాల్గొన్నారు.
- 71వ వార్డులోని వివిధ కాలనీల్లో గాంధీ చిత్రపటాల వద్ద కార్పొరేటర్ రాజాన రామారావు నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు,కాలనీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.
- గాజువాక శిష్టకరణ సంఘం ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. పేదలకు పళ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. సంఘం నాయకులు బలివాడ సత్యారావు, బాసంగి తిరుపతిరావు, గౌరీ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.
- 72వ వార్డులోని చినగంట్యాడ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గాంధీ చిత్ర పటానికి పార్టీ వార్డు ఇన్‌చార్జి ఎస్.శ్రీనివాస్ నివాళులర్పించారు.
- కాంగ్రెస్ పార్టీ గాజువాక నాయకులు జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. గవర వెంకట రమణారావు, ఉరుకూటి అచ్చిబాబు, పల్లేల శ్రీనివాసరావు, కొవిరి కోదండరావు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ మార్గం అనుసరణీయం

పెదగంట్యాడ: గాంధీజీ మార్గం అందరికీ అనుసరణీయమని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. 76వ వార్డు గాంధీనగర్‌లో హౌస్ ఓనర్ అసోసియేషన్ అధ్యక్షుడు కాతా బాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించి వేడుకల్లో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

- నడుపూరు గాంధీపార్కులో పైడిమాంబ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు మంత్రి శంకరనారాయణ, ములగపాక అచ్చెల్ నాయుడు ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహించారు. దేవన్‌రెడ్డి పాల్గొని గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పించారు.
- 65వ వార్డు బాపూజీ కాలనీ కూడలి వద్ద గల మహాత్మాగాంధీ విగ్రహానికి కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు నివాళులర్పించారు.
- 77వ వార్డు మహ్మద్ సాహెబ్ పేట మండల పరిషత్ పాఠశాలలో కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు.

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం శిష్టకరణాల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ కో-ఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షుడు జగదీశ్వరరావు పాల్గొన్నారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డి.సత్యారావు, గంగవరం గోపీ, ప్రతినిధులు పాల్గొన్నారు.

- కణితి కాలనీలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో సర్వోదయ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మహాత్మాగాంధీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు గాంధీజీ సూక్తులను ప్రచురించిన గోడపత్రికలు, స్టిక్కర్లను ఆవిష్కరించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.విజయ చందర్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు.
- 87వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ వార్డు అధ్యక్షుడు బొద్ద గోవింద్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహించారు. ఎన్నేటి రమణ, చిత్రాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: భెల్ గుర్తింపు యూనియన్ కార్యాలయంలో ఏఐటీయూసీ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో గాంధీ జయంతిని నిర్వహించారు. సంస్థ సీనియర్ మేనేజర్ (హెచ్‌ఆర్) జి.చంద్రశేఖర్ గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. యూనియన్ ఉప గౌరవ అధ్యక్షుడు కొల్లి దేముడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సుభాకర్ సాహు, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

- 69వ వార్డు నాతయ్యపాలెం బంగారుమాంబ అమ్మవారి ఆలయం ఎదురుగా గల గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన నివాళులర్పించారు. నగర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గవర వెంకట రమణారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.
- తుంగ్లాంలోని భెల్ గేటు వైపు గల కోనేరు గట్టు మీద గల గాంధీ విగ్రహానికి 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో..

ఉక్కునగరం: గాంధీజీ 154వ జయంతిని సోమవారం స్టీల్‌ప్లాంట్‌లో ఘనంగా నిర్వహించారు. సెక్టార్-8 మహాత్మాగాంధీ పార్కులో జరిగిన కార్యక్రమంలో సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్లు బాగ్చీ, ఎస్.సి. పాండే పాల్గొని, గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. అక్టోబర్ 31వరకు ఏర్పాటు చేసిన స్వచ్ఛతా క్యాంపెయిన్ 3.0ను సీఎండీ ప్రారంభించారు. కార్మిక సంఘాలు, అసోసియేషన్లు, వి స్టీల్ మహిళా సమితి ప్రతినిధులు పలువురు పాల్గొని నివాళులర్పించారు.

- స్టీల్‌పాంట్ ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద జరిగిన కార్యక్రమంలో సీజీఎం (వర్క్స్) ఎస్.వి. స్వామి మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళి అర్పించారు. ఉన్నతాధికారులు యు. శ్రీధర్, డాక్టర్ రమాదేవి, టి.గౌతమ్, శంకర్‌జీ, సుమన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: 87వ వార్డు లక్ష్మీపురం కాలనీలో రమాదేవి మహిళా సంఘం ఆధ్వర్యంలో గాంధీజీ జయంతిని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కోమటి శ్రీనివాసరావు పాల్గొని గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులు అర్పించారు. వేడుకల్లో భాగంగా చిన్నారులకు పలు క్రీడా పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జగన్నాధరావు, రమాదేవి, గాలి రమణమ్మ, గాలి రాజు, తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ విగ్రహావిష్కరణ

అగనంపూడి: 85వ వార్డు గొన్నవానిపాలెం శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్మించిన మహాత్మాగాంధీ విగ్రహాన్ని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆవిష్కరించారు. అనంతరం ఫార్మాకాలనీ వైద్యులు డాక్టర్ తాతాజీ సహకారంతో అమ్మ బ్లడ్ బ్యాంక్ సారధ్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు గొన్నా శ్రీనివాసరావు, గొన్నా విద్యా సంస్థల చైర్మన్ గొన్నా హేమచంద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

- అగనంపూడి ఏరియా ఆస్పత్రి ఆవరణలో గాంధీ విగ్రహానికి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉష పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సద్భావనా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, కమిటీ ప్రతినిధులు నక్కా కల్యాణి, గొలగాని శ్రీను, నక్కా రమణబాబు పాల్గొన్నారు.
- అగనంపూడి ఎస్‌బీఎంఎల్‌టీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బొర్రమాంబ ఆలయం వద్ద జాతిపితకు నివాళులర్పించారు. తరువాత ఆవరణలో మొక్కలు నాటారు. అనారోగ్యంతో బాధపడుతున్న లారీ ఓనర్‌కు అసోసియేషన్ రూ.20వేల నగదు అందించింది. కార్యక్రమంలో చిత్తా గణేష్, చిన్నా, నారాయణరావు పాల్గొన్నారు.
- అగనంపూడి హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో కమిటీ చైర్మన్ బంధం అప్పలరాజు, బలిరెడ్డి శ్రీను పాల్గొన్నారు
- 79వ వార్డు అగనంపూడి సత్రం కూడలి వద్ద మహాత్మాగాంధీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ, దువ్వాడ సీఐ శ్రీనివాసరావు, సేవా సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్ ఈడీ బిల్డింగ్ వద్ద నివాళి అర్పిస్తున్న ఉన్నతాధికారులు



77వ వార్డులో మహాత్ముడికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ సూర్యకుమారి



గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న శిష్టకరణాల అసోసియేషన్ సభ్యులు



భెల్ గుర్తింపు యూనియన్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న మేనేజర్ చంద్రశేఖర్, సాహు



నాతయ్యపాలెంలో గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు కరణంరెడ్డి తదితరులు

లాల్ బహదూర్ శాస్త్రికి ఘన నివాళి

ఉక్కునగరం: భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రికి స్థానిక వైఎస్సార్‌టీయూసీ నాయకులు నివాళులర్పించారు. శాస్త్రీ జీ జయంతి సందర్భంగా వైఎస్సార్‌టీయూసీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, అంజలి ఘటించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.మస్తాన్నప్ప మాట్లాడుతూ నాలుగో పంచవర్ష ప్రణాళికలో ప్రతిపాదిత ఐదో ఉక్కు కర్మాగారం విశాఖలో నెలకొల్పుతామని హామీ ఇచ్చింది లాల్ బహదూర్ శాస్త్రి అన్నారు. నాటి మహనీయులను స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో అంగరాజు, పి.జగదీష్, సీహెచ్.బాలకృష్ణ, అనీల్ కుమార్, ఎల్. దేవోజి, చంద్రశేఖర్, పి.రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



లాల్ బహదూర్ శాస్త్రికి నివాళి అర్పిస్తున్న వైఎస్సార్‌టీయూసీ శ్రేణులు

స్వచ్ఛందంగా రోడ్డు మరమ్మతులు

ఎల్ఎన్ గార్డెన్ వాసుల శ్రమదానం



కాంక్రీట్‌తో పూడ్చిన గోతులు



రోడ్డు మరమ్మతుల్లో పాల్గొన్న ఎల్ఎన్ గార్డెన్ వాసులు

అక్కిరెడ్డిపాలెం: గాంధీ జయంతి వేళ ఎల్ఎన్ గార్డెన్ వాసులు స్వచ్ఛంద సేవాకార్యక్రమం చేపట్టారు. చేయిచేయి కలిపి, రహదారిని బాగు చేసుకున్నారు. కాపుజగ్గరాజు పేట నుంచి ఎన్‌టీపీసీ రోడ్డు, ఫకీర్ తక్యా నుంచి కాపుజగ్గరాజు పేట వైపు రోడ్డుపై ప్రమాదకరమైన గోతులు తేలియున్నాయి. దీంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు.. తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ పరిస్థితిపై స్థానిక ఎల్ఎన్ గార్డెన్ వాసులు స్పందించారు. పలువురు స్వచ్ఛందంగా జేసీబీల సాయంతో కాంక్రీటుతో గోతులు పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ప్రతినిధులు గేదల గంగా మహేష్, బొత్స సోమేష్, ఎల్ఎన్ గార్డెన్స్ అధ్యక్షుడు వి.రమేష్ కుమార్, కార్యదర్శి వి.చైతన్యతో పాటు సుమారు 20మంది పాల్గొన్నారు. రోడ్డు బాగుపడటంతో వాహనచోదకులు హర్షం వ్యక్తం చేశారు.

యోగాలో స్వర్ణపతక విజేతకు సత్కారం

పెదగంట్యాడ: నేషనల్ యోగాలో గోల్డ్ మెడల్ సాధించిన అండిబోయిన లక్ష్మిని నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ న్యూఢిల్లీ జాతీయ అధ్యక్షుడు నెల్లి గురుదేవ్, హిందుస్థాన్ షిప్‌యార్డ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు యు.కె.స్వరూప్ సోమవారం ఘనంగా సత్కరించారు. మండలంలోని వుడా కాలనీలోని ఆమె స్వగృహంలో నిర్వహించిన కార్యక్రమంలో అండిబోయిన అప్పారావు, పీత గురుమూర్తి, బత్తిన రాము తదితరులు పాల్గొన్నారు.



అండిబోయిన లక్ష్మి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా..

- 'జగనన్న ఆరోగ్య సురక్ష'కు శ్రీకారం
- ప్రభుత్వ వైద్యసేవల్లో కొత్త అధ్యాయం
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వ వైద్య సేవలు అందించిన ఘనత మన ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రతి ఇంటినీ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సర్వే చేస్తున్నారని తెలిపారు. ప్రతీ కుటుంబంలోని పెద్దలు, మహిళలు, పిల్లల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. సీనియర్ వైద్యులతో ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దనే ఆరోగ్య వరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా చికిత్సలు, మందులు అందిస్తున్నామన్నారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితులను విజయవంతంగా ఎదుర్కొన్నామని, ఇప్పుడు ఏ ఇంట్లో ఏ ఒక్కరూ చిన్న ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నా వారికి తక్షణ చికిత్స అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం సహాయపడుతుందన్నారు.

ఐదు దశల్లో..

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఐదు దశల్లో అమలు చేస్తున్నామన్నారు. మొదటి మూడు దశల్లో ప్రభుత్వ వైద్యాధికారుల నేతృత్వంలో మూడు దఫాలుగా ఇంటింటి సందర్శన చేపట్టారని తెలిపారు. మొదటి దశలో అన్ని సచివాలయ పరిధిలో ఏఎన్ఎంలు, వలంటీర్లు ప్రతి ఇంటిని సందర్శించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు కుటుంబ సభ్యులకు స్క్రీనింగ్ తేదీ, క్యాంపు ప్రదేశం వివరిస్తున్నారని చెప్పారు. రెండో దశలో ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ప్రతి ఇంటినీ సందర్శించి కుటుంబ సభ్యులందరికీ బీపీ, సుగర్, హిమోగ్లోబిన్, మూత్ర పరీక్ష, డెంగ్యూ పరీక్ష, కఫ పరీక్షలు మొత్తం 7 రాపిడ్ పరీక్షలను నిర్వహిస్తారని వివరించారు. వాటి ఫలితాల ఆధారంగా వ్యక్తిగతంగా, అలాగే కుటుంబం మొత్తానికి సంబంధించిన పూర్తి ఆరోగ్య ప్రొఫైల్‌ను డిజిటల్ పద్ధతిలో రికార్డు చేస్తారని తెలిపారు. 3వ దశను ఈ నెల 30న ప్రారంభించారని, ఇందులో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు, తేదీ, వేదికల గురించి ప్రతి ఇంటికీ వెళ్లి వివరించారన్నారు. నాలుగో దశలో సురక్ష శిబిరాలు సమీప సచివాలయాల్లో ఏర్పాటు చేస్తారని, అక్కడ సీనియర్ వైద్యులు అందుబాటులో ఉంటారని తెలియజేశారు. ఐదో దశలో అనారోగ్య పరిస్థితుల ప్రకారం వారిని పెద్దసుపత్రులకు రిఫర్ చేయడంతో పాటు వారి ఆరోగ్యం మెరుగు పడేవరకు ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి అవసరమైన సహకారం అందిస్తారన్నారు. సమావేశంలో తిప్పల దేవన్‌రెడ్డి, పల్లా చినతల్లి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, బొడ్డు నర్సింహపాత్రుడు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు కోమటి శ్రీనివాసరావు, రోజారాణి, నాయకులు రాజాన రామారావు, ధర్మాల శ్రీను, దొడ్డి రమణ, మంత్రి శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యం మన ప్రత్యేకత



హిందూ, ముస్లిం, క్రైస్తవుల వేషధారణలో విద్యార్థులు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డాక్టర్ రమేష్ కుమార్

గాజువాక: మతసామరస్యాన్ని కాంక్షిస్తూ జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో సోమవారం వినూత్న ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు హిందూ, ముస్లిం, క్రైస్తవులు, గాంధీ, భరతమాత వేషధారణతో పాతగాజువాక జంక్షన్‌లో ఈ ప్రదర్శన నిర్వహించారు. 'హిందూ, ముస్లిం, క్రైస్తవుడు.. ఎవరైతేనేం మానవుడే' అంటూ నినదించారు. జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఎం.రమేష్ కుమార్ మాట్లాడుతూ మత సామరస్యం, లౌకిక తత్వం మన ప్రత్యేకత అన్నారు. మత సామరస్యం కోసం, వివిధ మతాల మధ్య ఐక్యత కోసం గాంధీజీ తన ప్రాణాలను సైతం అర్పించారన్నారు. అందువల్లే ఆయన జయంతి రోజున మత సామరస్య దినంగా జేవీవీ ఈ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. జేవీవీ ప్రతినిధులు పాల్గొన్నారు.